టీటీడీసీలో చల్లారని మంటలు

రికార్డుల గది నుంచి వస్తున్న పొగలు

డిచ్‌పల్లి, మే 25 : మండలకేంద్రంలోని టీటీడీసీ భవనంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి రికార్డులన్నీ దగ్ధమైన విషయం తెలిసిందే. మంటలు రెండో రోజు శనివారం కూడా చల్లారలేదు. శుక్రవారం రాత్రి పొక్లెయిన్‌తో గోడను తొలగించారు. భారీ ఎత్తున పాత రికార్డులు ఉండడంతో మంటలు ఆరడం లేదు. దట్టమైన పొగలు వస్తుండడంతో అగ్నిమాపక సిబ్బంది మళ్లీ వచ్చి మంటలార్చే ప్రయత్నం చేశారు.

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించాలి

వినతిపత్రం అందజేస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

సిరికొండ, మే 25 : మండలంలో ఇటీవల బలమైన ఈదురుగాలులు వీయడంతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి, రైతుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్, జిల్లా నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వానకాలం సీజన్‌లో భాగంగా పొలాల్లో పనులు ప్రారంభించే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాన్స్‌కో అధికారులు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, సాయిరెడ్డి, లింబాద్రి, కిశోర్, సాయిలు, ఎర్రన్న, గంగారాం పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అంజలి

ధర్పల్లి (సిరికొండ), మే 25 : ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన మాకూరి అంజలి (20) అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. శనివారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన అంజలి.. తిరిగి ఇంటికి రాలేదని, బంధువులను ఇండ్ల సంప్రదించినా ఆచూకీ లభించలేదని తెలిపారు. అంజలి తల్లి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధిహామీ పరిరక్షణకు పోరాటమే మార్గం

ఇందల్వాయి, మే 25 : ఉపాధిహామీ పరిరక్షణకు పోరాటమే సరైన మార్గమని, పని హక్కు కోసం పోరాడాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని అన్సాన్‌పల్లిలో ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి సరిపడా నిధులు కేటాయించడం లేదని, పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు రమేశ్, సాయారెడ్డి, కిశోర్, దామోదర్, లింబాద్రి, సాయిలు, ఎర్రన్న, పెద్దన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిజామాబాద్ బస్టాండ్‌లో వీల్‌చైర్ ఏర్పాటు

వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకెళ్లున్న సిబ్బంది

ఖలీల్‌వాడి, మే 25 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్‌ను ఏర్పాటు చేశారు. వీల్‌చైర్‌ను రీజినల్ మేనేజర్ జానీరెడ్డి శనివారం ప్రారంభించారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం వీల్‌చైర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం తెలిపారు. కార్యక్రమంలో డీఎం సరస్వతి, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

శక్కర్‌నగర్, మే 25: వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలోని మిల్లర్ల భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌అప్ప అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శోభన్ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో నాయకులు పల్లపు వెంకటేశ్, భూమన్న, గంగామణి, లక్ష్మణ్, నాగలక్ష్మి, ముత్తన్న, సుశీల పాల్గొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

రెంజల్, మే 25 : మండలంలోని సాటాపూర్ గ్రామంలో గుర్రాల సాయిలు కిరాణ దుకాణంలో చోరీ జరిగినట్లు ఎస్సై సాయన్న శనివారం తెలిపారు. తెలంగాణ చౌరస్తా వద్ద ఉన్న కిరాణ దుకాణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పైకప్పును ఎత్తి సిగరెట్లు, ఇతర వస్తువులను దోచుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

- మండల వ్యవసాయాధికారులు
- పలు మండలాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

నందిపేట్‌లోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారిణి

మాక్లూర్/ బోధన్ రూరల్/ నందిపేట్/ ముప్కాల్, మే 25: లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారులు సూచించారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలు, లేబుల్‌తో కూడిన బ్యాగులను విక్రయించాలని పేర్కొన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో మండల వ్యవసాయాధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. మాక్లూర్‌లో ఏవో పద్మ, బోధన్ మండలంలోని ఊట్‌పల్లిలో ఏఈవో గంగాజల, నందిపేట్‌లో మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నాభవానీ, ముప్కాల్ మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు డీలర్లు రసీదుపై సంతకాలు చేసి ఇవ్వాలని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు, రసీదులు తీసుకొని, పంట వచ్చే వరకు దాచి ఉంచాలని సూచించారు. లైసెన్సు కలిగి ఉన్న కంపెనీలే విత్తనాలు, మందులను విక్రయించాలన్నారు.

రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి

డిచ్‌పల్లి/ సారంగపూర్, మే 25 : ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం రైతులకు రసీదులు తప్పకుండా ఇవ్వాలని ఏడీఏ ప్రదీప్ కుమార్ సూచించారు. డిచ్‌పల్లి మండలంలోని నడ్పల్లి రైతువేదికలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి మండలాల విత్తన దుకాణాల డీలర్లతో, నిజామాబాద్ రూరల్ ఏడీఏ కార్యాలయంలో మోపాల్, నిజామాబాద్ మండలాలకు చెందిన విత్తన డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల విక్రయాల నియమ నిబంధనలను డీలర్లకు వివరించారు. విత్తనాల వివరాలు, ధరల పట్టికలను దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాలు కొన్న రైతుల వివరాలను రోజూవారీగా రిజిస్టర్లలో పొందుపర్చాలని అన్నారు. అనంతరం నడ్పల్లిలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశాల్లో డిచ్‌పల్లి, రూరల్ మండల వ్యవసాయాధికారులు రాంబాబు, హీరాజాద్, ఏఈవోలు స్వాతిలత, రాకేశ్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

కచ్చితంగా స్టాక్ వివరాలను ప్రదర్శించాలి

ఏర్గట్ల, మే 25: విత్తనాలు, పురుగు మందుల దుకాణాలు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని, డోర్ నంబర్, లైసెన్స్‌తోపాటు స్టాక్ వివరాలను కనబడేలా బోర్డు ఏర్పాటు చేయాలని భీమ్‌గల్ డివిజనల్ వ్యవసాయ సంచాలకుడు కాంపాటి మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మండల వ్యవసాయధికారి మహ్మద్ అబ్దుల్ మాలిక్ ఆధ్వర్యంలో విత్తన, పురుగుల మందు డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై డీలర్లకు పలు సూచనలు చేశారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖలీల్‌వాడి, మే 25 : జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించగా.. 2,878 మంది విద్యార్థులకు 2,652 మంది హాజరు కాగా.. 226 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ వెల్లడించారు. ద్వితీయ సంవత్సరంలో 934 మంది విద్యార్థులకు 858 మంది హాజరుకాగా.. 76 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

నేటితో ముగియనున్న పరీక్ష ఫీజు గడువు

ఖలీల్‌వాడి, మే 25 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ ఫీజు కట్టేందుకు నేడు (ఆదివారం) చివరి గడువు అని ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరం అడ్మిషన్ తీసుకున్నవారితోపాటు 2018 నుంచి 2023 సంవత్సరంలో అడ్మిషన్ తీసుకొని, సెమిస్టర్ పరీక్షలు రాయని వారు రూ. 1000 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు కట్టాలని సూచించారు.

హోరాహోరీగా జాతీయస్థాయి క్యారం పోటీలు

క్యారం ఆడుతున్న క్రీడాకరులు

ఖలీల్‌వాడి, మే 25 : ఆలిండియా ఇనిస్టిట్యూషనల్ క్యారం చాంపియన్‌షిప్ పోటీలు సెమీఫైనల్‌కు చేరాయి. మూడో రోజైన శనివారం మహిళా విభాగంలో ఆకాంక్ష, హజీమా, నాగజ్యోతి, పురుషుల విభాగంలో శ్రీనివాస్, గఫ్రాన్, ప్రశాంత్ మోరే, యోగేశ్ పరదేశి సెమీఫైనల్‌కు చేరారు. అంతర్జాతీయ క్రీడాకారుల మధ్య క్యారం పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఇంటర్నేషనల్ క్యారం అసోసియేషన్ కార్యదర్శి వీడీ నారాయణ, ఆలిండియా క్యారం అసోసియేషన్ కార్యదర్శి భారతి నారాయణ, సంతోష్ తెలిపారు.

నెట్‌బాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతగా నిలిచిన నిజామాబాద్ జట్టు సభ్యులతో అతిథులు

నవీపేట,మే 25: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల విజేతలకు శనివారం బహుమతులను ప్రదానం చేశారు. నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీలో నిజామాబాద్, తాడ్‌బిలోలి, సుద్దలం, గుత్ప, అన్సన్‌పల్లి, ముబారక్‌నగర్‌కు చెందిన బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో నిజామాబాద్, బాలికల విభాగంలో సుద్దులం జట్టు విజేతగా నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి నర్సయ్య హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు

ఎస్సీ,ఎస్టీల గురించి మాట్లాడే నైతికహక్కు బీజేపీకి లేదు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

కంఠేశ్వర్, మే 25 : ఎస్సీ, ఎస్టీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గీకరణ సామాజిక వెనుకబాటు ఆధారంగా చేశారని, అన్నివర్గాలకు న్యాయం జరిగే విధంగా రిజర్వేషన్లు చేశారని అన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం సామాజికంగా వెనుకబడిన వారికి కాకుండా రిజర్వేషన్ లేని, ఆర్థికంగా ఉన్నవారికి రిజర్వేషన్ కల్పించే జీవోను తీసుకువచ్చిందని అన్నారు. ఎకనామికల్ వీకర్ సెక్షన్ పేరుతో దళితుల పొట్ట గొట్టవద్దని అన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధానకార్యదర్శి గడుగు గంగాధర్, జావిద్ అక్రమ్, రామర్తి గోపి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వేణుకిసాన్‌నగర్ తండాలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మాక్లూర్, మే 25: జిల్లా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు మండలంలోని వేణుకిసాన్‌నగర్ తండాలో సైబర్‌నేరాలపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్ రావు, ఏఎస్సై నర్సయ్య మాట్లాడుతూ.. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి కాల్స్ వస్తే ఓటీపీ నంబర్ చెప్పవద్దన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, మే 25 : జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో నేడు (ఆదివారం) ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ తోట రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్, పాములబస్తీ, హమాల్‌వాడీ, నాందేవ్‌వాడ, హౌసింగ్ బోర్డు, బ్యాంక్‌కాలనీలో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయస్థాయి శిబిరంలో రాంపూర్ పాఠశాల విద్యార్థులు

శిబిరంలో పాల్గొన్న రాంపూర్‌లో జడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థులు భావన, వైష్ణవి

డిచ్‌పల్లి, మే 25 : 'ఏక్ భారత్ - శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ కెడెట్ల జాతీయస్థాయి శిబిరాన్ని నిర్వహించారు. ఈ క్యాంపు మే 14 నుంచి 25వ తేదీ వరకు మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఎన్‌సీసీ కెడెట్లు ఎ.భావన, పి.,వైష్ణవి పాల్గొన్నారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఎన్‌సీసీ కెడెట్లు కూడా శిబిరంలో పాల్గొన్నట్లు ఎన్‌సీసీ అధికారి శ్రీనివాస్ ఖత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రదేశాల్లోని సంస్కృతి, పౌరసత్వాన్ని తెలుసుకోవడం, దేశ ఔనత్యాన్ని గుర్తించడమే ముఖ్య ఉద్దేశంగా ఈ శిబిరాన్ని నిర్వహించారని తెలిపారు.

బోధన్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

పాఠశాలల పునఃప్రారంభంలోగా పనులు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ అంకిత్

బోధన్, మే 25: బోధన్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ అంకిత్ శనివారం తనిఖీ చేశారు. పట్టణంలోని ఐదు పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు కొనసాగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటనారయణ, ఏఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

పాలమూరు శిక్షణకు తరలిన యువతులు

సుభాష్‌నగర్, మే 25 : విశ్వహిందూ పరిషత్‌లోని యువతి విభాగం (దుర్గా వాహిని) శిక్షణ కోసం పాలమూరుకు 26 మంది శనివారం బయలుదేరినట్లు కన్వీనర్ నాంచారి ఝాన్సీరాణి తెలిపారు. వారం రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో కర్రసాము, కరాటే తదితర ఆత్మరక్షణ శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ కార్యాలయం వద్ద సంస్థ ప్రతినిధులు కత్రాజి నరేందర్, రెబ్బ ఆనంద్, రమేశ్, మురళి తదితరులు యువతులకు వీడ్కోలు పలికారు.

నేడు ప్రభాత్‌శాఖ వార్షికోత్సవం

సుభాష్‌నగర్, మే 25 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ - ఇందూరు శాఖ ఆధ్వర్యంలో గూపన్‌పల్లిలోని శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీ నీలకంఠేశ్వర ఉద్యోగి ప్రభాత్ శాఖ వార్షికోత్సవాన్ని నేడు (ఆదివారం) నిర్వహించనున్నట్లు కార్యవాహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానవక్తగా సామాజిక సమరసత వేదిక తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్, ముఖ్యఅతిథిగా పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్ఈ విద్యాసాగర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు సకాలంలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల అడ్మిషన్ డ్రైవ్

విద్యార్థికి అడ్మిషన్ రసీదును అందజేస్తున్న అధ్యాపకులు

ధర్పల్లి (సిరికొండ), మే 25 : పదోతరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని ప్రిన్సిపాల్ రజీయొద్దీన్ తెలిపారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలకు చెందిన అధ్యాపకులు శనివారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని మైలారం దుబ్బాక, సల్లగరిగె గ్రామాల్లో విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి అడ్మిషన్లు స్వీకరించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యాబోధనతోపాటు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.

సాయినగర్, భవానీ యూత్ సభ్యుల రక్తదానం

ఖలీల్‌వాడి, మే 25 : జిల్లాకేంద్రంలోని సాయినగర్ యూత్, భవానీ యూత్ సభ్యులు రెడ్‌క్రాస్‌లో శనివారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ అర్బన్ చైర్మన్ నరాల సుధాకర్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్‌లో రక్తం కొరత ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం తెలుసుకున్న యూత్ సభ్యులు రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, సాయికృష్ణ, రఘురాం, సంతోష్, వెంకటేశ్, రవీందర్, అనిల్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో గాలీవాన బీభత్సం

ఉప్లూర్ గ్రామంలో ఈదురుగాలులకు ఎగిరిపోయిన రేకులు

మోర్తాడ్, మే 25: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో శనివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. గాలి దుమారానికి గ్రామానికి చెందిన గూండ్ల రమేశ్ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. రేకులషెడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో పెద్దమొత్తంలో నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

పల్లెప్రగతి పనుల పరిశీలన

మోర్తాడ్, మే 25: మండల కేంద్రంలో డీఎల్పీవో శివకృష్ణ శనివారం పర్యటించారు. పల్లెప్రగతి పనుల్లో భాగంగా నర్సరీ, పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, కంపోస్టుషెడ్డులను పరిశీలించారు. కంపోస్టుషెడ్డులో కంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సరీ, పల్లెప్రకృతివనం, వైకుంఠధామం నిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేశారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో కంపోస్ట్ తయారు చేయాలన్నారు. డీఎల్పీవో వెంట ఎంపీవో శ్రీధర్, కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

ఉపాధి హామీ పనులు..

ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఏపీవో గంగారాం

కోటగిరి, మే 25 : కోటగిరి మండలకేంద్రంలోని దామర చెరువులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో గంగారాం శనివారం పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పని అడిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎంత మంది కూలీలు పనిచేస్తున్నారో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు.

గొర్రెలకు చిటుకు వ్యాధి నిరోధక టీకాలు

మాక్లూర్/ రుద్రూర్, మే 25 : మాక్లూర్ మండలంలోని పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ముత్యంపల్లి, చిక్లీ గ్రామాల్లో గొర్రెలకు చిటుకు రోగ నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే తెలిపారు. గొర్రెలకు సీజనల్ వ్యాధులు, పశువులకు వచ్చే గొంతువాపు, జబ్బవాపు రోగాలకు సంబంధించిన టీకాలు మండలంలో అందుబాటులో ఉన్నాయని, పాడి రైతదులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర్, వినీత, గంగాజమున, అహ్మద్‌పాషా, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు. రుద్రూర్ మండలంలోని చిక్కడ్‌పల్లిలో గొర్రెలకు చిటుకు వ్యాధి నిరోధక టీకాలను వైద్యుడు సంతోష్ వేశారు. గ్రామంలో 422 గొర్రెలకు టీకాలు వేసినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **కంపు కొడుతున్న కాలనీ:** ఆర్మూర్‌టౌన్, మే25: పట్టణంలోని 32వ వార్డులో శనివారం ఉదయం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. కానీ పూడిక తీసిన చెత్తను తీసుకువెళ్లకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నదని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగింపజేయాలని కోరారు.
- **శానిటేషన్ స్పెషల్ డ్రైవ్:** ఆర్మూర్‌టౌన్, మే 25: వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ అధికారులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులను అధికారులు పరిశీలించినట్లు పేర్కొన్నారు.
- **బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత :** బాల్కొండ, మే 25: మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన గొల్లెం శివన్నకు చెందిన మొబైల్ ఫోన్ ఏప్రిల్ నెలలో చిట్టాపూర్ నుంచి బాల్కొండకు వస్తుండగా మధ్యలో ఎక్కడోపడిపోయింది. దీంతో ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను వెతికి శనివారం బాధితుడికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.
- **కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు :** భీమ్‌గల్, మే 25: మండల కేంద్రంలో డిగ్రీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ప్రిన్సిపాల్ సతీశ్ తెలిపారు. శనివారం డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ 1వ సెమిస్టర్ పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, MONCHU LIMBANNA S/o.MONCHU RAJANNA, H.No.6-37, Renjarla, Balkonda, Nizamabad Changed my name as MENCHU LIMBANNA S/o. MENCHU RAJANNA NTZ-324691

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ

- ఒక లారీ దగ్ధం.. ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రమాదంలో దగ్ధమవుతున్న లారీ

ఆర్మూర్‌టౌన్, మే 25: ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనగా ఒక లారీ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన ఆర్మూర్ పట్టణశివారులోని 63వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఇందుకుసంబంధించిన వివరాలు.. గ్రానైట్ లోడ్‌తో గుజరాత్ నుంచి విశాఖపట్టణం వైపు వెళ్తున్న లారీ.. అదే సమయంలో కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న లారీ ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ శ